


# దొంగ కాని దొంగ

ముద్దంశెట్టి హనుమంతరావు

"ఏమిటీ! దొంగతనమే!"

"పట్టగలవా? ఏం ధైర్యం?"

"ఎంత ఆశ్చర్యం? ... యిల్లాంటి సంఘటన యెప్పుడూ వినలేదు."

"పాపం! యిప్పుడే వాళ్ళ బావగారింటికి వెళ్ళిందటావిడ."

"ఏమైనా, యీ రోజు వాళ్ళకి మహా చెడ్డది...పాపం యేమిటి పోయాయో!"

"ఆవిడ గుండె బాదుకుంటేనే సరిపోతుంది. ఏమిటి పోయాయో యేం చెబుతుంది?"

"ఎవరన్నా అంతే! ఆ సమయంలో మరేం ఆలోచన తట్టదు."

"అయినా యింత గజదొంగలు యీ వూళ్లో వున్నారని తెలీదు...ఎంత ఘోరం!...ఎంత ఘోరం!..."

ఇలా మనిషో మాటంటున్నారక్కడ గుమికూడిన ప్రజ. గోపాలంగారిల్లు ఓ మ్యూజియంలా వున్నట్టే, అంతా ఎగబడి చూస్తున్నారు.

"వెధవరోజులేం బావులేవు. పట్టపగలు దొంగతనాలు, దోపిడులూ జరిగితే యింకెట్లా బ్రతికేది? వూళ్లోవున్నా అడవిలో వున్నా ఒహటే అనిపిస్తుంది." అనుకుంటూ వచ్చాడు, గోపాలం యెదురింటి పరంధామయ్య. అంతమందీ అక్కడ గుమిగూడ్డం పరంధామయ్యకేం నచ్చలేదు.

"ఏమిటండీ చూస్తారు? ఇక అయ్యిందిగా, వెళ్లండి." అంటూ లోపలికిపోయి "హూ! వీళ్ళబ్బగారి సొమ్ము దాచినట్టే సామానంతా గిరాటేశారు" అంటూ హూంకరించి సామానంతా తీసి సర్దుతూ—

"అలా యేడిస్తే యేంలాభం చెల్లీ! పోయినవెలాగూ పోయాయ్...యిక యీ వున్నవి వచ్చినవాళ్ళల్లో యెవరూ కాజేసుకుపోకుండా చూడు. అల్లాంటి

మనుషులందరని నిశ్చయంగాచెప్పలేం" అన్నాడు పరంధామయ్య లక్ష్మి నుద్దేశిస్తూ. పరంధామయ్య బంధువు కాకపోయినా లక్ష్మిని చెల్లి అని పిలుస్తుండటం, ఆమె అతన్ని అన్నయ్య అని సంబోధిస్తుండటం కద్దు ... పరంధామయ్యని చూడ్డంతో ఆమెకి మరింత దుఃఖం పొర్లుకొచ్చింది. ఏడుపుస్వరం సప్తమ స్థాయినందుకుంది.

పరంధామయ్య మాటలు అక్కడున్న వారికి ముల్లుగుచ్చుకున్నట్టయాయి.ఏమో యింకేమన్నా పోతే తమపై నింద పడుతుందేమోనని ఒక్కొక్కరూ మెల్లగా జారుకున్నారు. ఇక మిగిలినవాళ్ళంతా లక్ష్మికి సన్నిహిత బంధువులే...ఆమెకి ధైర్యం చెబుతూ వూరడిస్తున్నారు.

"వెధవలు—టేబిలు డ్రాయర్లో యే బంగారపు వస్తువులుంటాయో, అనుకున్నారు గామోసు. అందులో కాగితాలు కూడా గిరవాటువేశారు" అంటూ టేబిలు దగ్గరికి పోయి అన్నీ సక్రమంగా సర్దిపెట్టాడు.

"ఏవిఁటి పోయాయో చెప్పు చెల్లీ! పోలీసుకి రిపోర్టు చెయ్యొద్దూ మరి..." అన్నాడు పరంధామయ్య. లక్ష్మి జవాబు చెప్పే పరిస్థితిలో లేదు. అయినా పరంధామయ్య మళ్ళీ అడిగాడు.

"వెండిసామానంతా దోచుకుపోయారన్నయ్యా..." అంది యేడుపు స్వరంతో. మళ్ళీ చప్పున ఆమెకేదో జ్ఞాపకమొచ్చినట్టయి చరచరా టేబిలు దగ్గరికి పోయి వాచీపెట్టె తెరిచింది. ఆమె గుండెలు ఆగిపోయినంత పనయ్యింది. అందులో వాచీకూడా లేదు.

"వాచీకూడా పట్టుకపోయారన్నయ్యా" యేడుపు లంకించుకుంటూ అంది.

"వాళ్ళ కిదీ, అదీ అన్న మాటేఁవిటమ్మా. చేతికందినదంతా వూడ్చుకపోతారు. అందులోనూ యింక చేతివాచీ అగుపిస్తే వదిలేస్తారూ? ఏం, యివాళ గోపాలం తీసుకెళ్ళలేదూ?" అన్నాడు పరంధామయ్య వాచీ పెట్టెను పరిశీలిస్తూ.

"లేదన్నయ్యా! తొందర్లో మర్చి వెళ్ళిపోయారు."

"ఇంతకీ వాచీకూడా పోయే యోగం వుంది. మనం యేంచేస్తాం? అంతా భగవన్నిర్ణయం." వేదాంతంలోకి దిగాడు పరంధామయ్య. ఆ వేదాంతాన్ని అర్థంచేసుకునే స్థితిలో లేదు లక్ష్మి.

పరంధామయ్య వుపేక్షచేయకుండా పరుగు నడకలతో పోయి పోలీసు స్టేషనులో రిపోర్టుచేశాడు.

"పట్టపగలు దొంగతనమా?" పోలీసువాళ్ళు మరీ ఆశ్చర్యపోయారు. రక్షకశాఖంటూ ఒకటి వుంటుండగానే పగలు దొంగతనాలు జరిగితే యింకేవిఁటి? ఇనస్పెక్టరు యిద్దరు పోలీసులతో వెంటనే పరంధామయ్యవెంట బయలుదేరాడు.

ఇనస్పెక్టరు అడగవల్సిన ప్రశ్నలు చాకచక్యంగా అడిగి, పోయిన వస్తువుల జాబితా రాసుకున్నాడు. శక్తివంచన లేకుండా ఆచూకీ తీసేందుకు ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చి వెళ్ళిపోయాడు. "వస్తువులు దొరికిపోవచ్చు లేవమ్మా! యేం ఫరవాలేదు" అంటూ ధైర్యం చెప్పాడు పరంధామయ్య. అతనికున్న పాటి ధైర్యం లక్ష్మికుంటుందా?

అతి శ్రద్ధతో, చెలాకీగా ఆచోకీ తియ్యటంవల్ల దొంగ పట్టుబడ్డాడు, వెండి వస్తువులతో సహా. తనశ్రమ ఫలించి నందు కుప్పొంగిపోతూ దొంగని గోపాలం యింటికి తీసుకొచ్చాడు యినస్పెక్టరు. ఇనస్పెక్టరు గోపాలం గడప తొక్కడం చూసిన పరంధామయ్య వున్న పాటున అక్కడ తయ్యారయ్యాడు.

"మీకు మేం యెంతో కృతజ్ఞుల మండీ! అనుపమానమైన శ్రద్ధ తీసుకుని సాధించారు" నవ్వుతూ అన్నాడు పరంధామయ్య.

"దానికేంలెండి! మా కర్తవ్యం మేం నిర్వహించాం...యిదిగోండి ... యీ సామాన్లేకాదూ పోయాయ్" అంటూ పోలీసు చేతిలోవున్న సంచితో సామాన్లం దించాడు యినస్పెక్టరు. పరంధామయ్య వుత్సాహంగా వాటిని లక్ష్మి దగ్గిరికి తీసుకపోయాడు. పోయిన వస్తువులు మరి దొరకవన్న నమ్మకంతో వుందేమో లక్ష్మి వాటిని చూడ్డంతో తబ్బిబ్బయి పోయింది. ఆమె హృదయకుహరంనుండి ఆనందం వెల్లువలై పారింది. అవన్నీ తీసిచూసింది. తనింట్లోవే...సందేహం లేదు.

"అన్నీ మనవేనన్నయ్యా! ఎక్కడ దొరికాడు దొంగ?" అంది వుత్సాహంగా.

"ఎక్కడో ఒహదగ్గర దొరక్క పోతాడా? రక్షణశాఖంటూ ఊరికెనే వుందామ్మా? నేనప్పుడే అన్నానుగా దొరికిపోతాయని..."

"మరి రిస్టువాచీ అన్నయ్యా?" అంత వరకూ వెండిసామాన్లుతీసిసంబరపడుతుం దేగాని వాచీ విషయం జ్ఞప్తికి రాలేదు.

"ఔనుకదూ! నేనూ మర్చిపోయాను. జాబితా తీసుకున్నాడుకదా, యినస్పెక్టర్ కయినా జ్ఞాపకముండొద్దూ? వాడిదగ్గర దొరకలేదుగామోను...ఎవరికో అమ్మేసి వుంటాడు వెధవ...అడుగుతానుండు'' అంటూ వెళ్ళిపోయాడు.

"అన్నీ వున్నట్టేనండీ?" అడిగాడు యినస్పెక్టరు.

"ఒక్కటి తప్పించి అన్నీ వున్నయ్ సార్" అన్నాడు పరంధామయ్య.

"ఏవిటది?"

"రిస్టువాచీ సార్ ... కొత్తది... మొన్ననే కొన్నాడు మావాడు...దుర దృష్టం వశాత్తూ యీవాళే మర్చిపోయి వెళ్ళిపోయాడు."

ఇనస్పెక్టరు దొంగవేపు తీక్షణంగా చూచాడు. దొంగ విస్తుపోయాడు. ఆ

వాచీసంగతి తనకి తెలీదే...అడుగతారేమోననుకున్నాడు.

"ఏఁరా, వాచీ యేంజేశావ్?" గర్జించాడు యినస్పెక్టరు.

"వాచీ యెలాంటిదో నేను చూడలేదు బాబూ! వెండిసామాను తప్పించి మరేం తియ్యలేదు..." వణుకుతూ అన్నాడు దొంగ.

"నువ్వు తియ్యకపోతే యెవడు తీస్తాడ్రా?" గర్జించాడు పరంధామయ్య.

''ఎక్కడుంచావ్ చెప్పు వెధవా? లేకపోతే డొక్కచీల్చేస్తాను" గుడ్లెర్రజేశాడు యినస్పెక్టరు. 'తను నిజం చెప్తున్నా నమ్మరేం' అని లోలోన బాధపడ్డాడు దొంగ.

"నేను తియ్యలేదు బాబూ! నిజం చెవుతున్నాను'' అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"వెధవా, నీకు నిజం అన్నమాటకి అర్థం తెలుసునేవిఁటిలే ... మాటాడితే అబద్ధం—ఠాణాకి పద, చెప్తాను" అన్నాడు యినస్పెక్టరు.

దొంగ దొంగే! వాడెంత నిజం చెబుతున్నా నిజంలా అగుపించదు. అబద్ధాల పుట్టని అందరి అభిప్రాయం.

"ఎవరికో అమ్మేసి వుంటాడండీ!" వెనక తాళం వేశాడు పరంధామయ్య.

"ఆ విషయం నేను ఠాణాలో కూపీ తీస్తాన్లెండి...వస్తానుమరి" అనుకుంటూ వెళ్ళిపోయాడు యినస్పెక్టరు దొంగని తీసుకుని.

"ఏమన్నా డన్నయ్యా దొంగ?" అనుకుంటూ వచ్చింది లక్ష్మి.

"వాచీ విషయం చెప్పకుండా వున్నాడమ్మా. ఎక్కడో అమ్మేసివుంటాడు... అయినా ఆ విషయం కనుక్కుంటామన్నారు ఇనస్పెక్టరు...మరి నే నాస్తాను" అనుకుంటూ పోయాడు పరంధామయ్య.

పరంధామయ్య ముసిముసి నవ్వుల్తో యిల్లు చేరుకున్నాడు. టేబిలు డ్రాయరు తీసి అందులోని కొత్త రిస్టువాచీ కళ్లారా చూస్తూ మురిసిపోయి సంతృప్తి పడ్డాడు ...నేరమంతా దొంగమీగ పడింది... ఇంక తనకేం? తను సామాన్లు సర్దుతున్నప్పుడు వాచీ కాజేశాడని యెవరనుకుంటారు? తను పెద్ద మనిషి! మర్యాదస్తుడు!! ఎవరూ అనుమానించడానికాస్కారం లేదు...అనుకుంటూ మెల్లగా డ్రాయరు వేసేశాడు.

